సాక్షి సంగారెడ్డి

సోమవారం । 23 । జూన్ । 2025



వాన కురవక.. సాగు సాగక

ఏప్రిల్‌లో ముందస్తుగా వర్షాలు కురిశాయి. జూన్‌లో మాత్రం ముఖం చాటేశాయి.

వివరాలు 8లో ▸



అవినీతిపై చర్యలు తీసుకోండి

చేపల అమ్మకంలో అవినీతికి పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలని పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

వివరాలు 8లో ▸



పాలిథిన్..పాయిజన్

పాలిథిన్ కవర్లు పర్యావరణానికి, పశువులకు ముప్పుగా పరిణమించాయి.

వివరాలు 9లో ▸

నూనెగింజల ఉత్పత్తికి ఊతం

పెంపే లక్ష్యంగా ప్రభుత్వం కొత్త పథకానికి శ్రీకారం

- ఈ ఖరీఫ్ నుంచే ఎన్‌ఎంఈఓ అమలు
- రైతులకు ఉచితంగా కొత్త విత్తన రకాల సరఫరా
- లబ్ధిదారుల ఎంపికకు వ్యవసాయశాఖ సన్నాహాలు



సాక్షిప్రతినిధి, సంగారెడ్డి : వంట నూనె గింజల పంటల విస్తీర్ణం ఉత్పత్తి పెంచడమే లక్ష్యంగా ప్రభుత్వం సరికొత్త పథకానికి శ్రీకారం చుట్టింది. ఎన్‌ఎంఈఓ (నేషనల్ మిషన్ ఆన్ ఈడబుల్ ఆయిల్) పథకం కింద సోయా, పొద్దుతిరుగుడు, వేరుశెనగ, నువ్వులు, కుసుమ పంటలు సాగు చేసే రైతులకు ప్రోత్సాహకాలు ఇవ్వాలని నిర్ణయించింది. ఇందులో భాగంగా రైతులు సాంప్రదాయ పంటలకు స్వస్తి చెప్పేలా..అధిక దిగుబడులు ఇచ్చే కొత్త రకాల విత్తనాలను ఉచితంగా సరఫరా చేయనుంది. అలాగే సంబంధిత వ్యవసాయ శాస్త్రవేత్తలతో సాంకేతిక సహాయాన్ని అందించనుంది. ఈ ఖరీఫ్ సీజన్ నుంచే ఈ పథకాన్ని అమలు చేయనుంది. 2030 వరకు ఈ పథకాన్ని కొనసాగించాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్ణయించాయి. ఈ మేరకు ఎంపిక చేసిన జిల్లాల్లో లబ్ధిదారుల గుర్తింపుకు సన్నాహాలు చేస్తున్నారు.

అధిక దిగుబడిని ఇచ్చే విత్తనాల ఉచిత సరఫరా..

ఈ పథకం కింద ఎంపికైన రైతులకు ఉచితంగా నూనె గింజల విత్తనాలను ప్రభుత్వమే సరఫరా చేయనుంది. ఒక్కో రైతుకు రెండున్నర ఎకరాలు (ఒక హెక్టారు)కు పరిమితి విధించారు. ఉదాహరణకు సోయా సాగు చేస్తున్న రైతులు 1994లో విడుదల చేసిన జే.ఎస్.-335 వెరైటీనే ఎక్కువగా విత్తుకుంటున్నారు. ఈ వెరైటీతో ఆశించిన దిగుబడి రావడం లేదు. వీటి స్థానంలో 2021లో రిలీజైన డీఎస్‌బీ-34, ఎంఏసీఎస్-1460 వెరైటీ సోయా విత్తనాలను సరఫరా చేస్తారు. అలాగే రైతు ఉత్పత్తి కేంద్రాలను ఏర్పాటు చేసి వారి ఉత్పత్తులను ప్రభుత్వమే కొనుగోలు చేస్తుంది. పంటలను ఎప్పటికప్పుడు పరిశీలించి, తగిన సూచనలు చేసేందుకు సంబంధిత వ్యవసాయ శాస్త్రవేత్తలతో సాంకేతిక సహాయాన్ని అందిస్తారు.

పాత వెరైటీలతో 60% తక్కువ దిగుబడి

కొత్తగా వచ్చిన నూనెగింజల విత్తన రకాలకు, ప్రస్తుతం రైతులు వాడుతున్న విత్తనాలకు వచ్చే దిగుబడిలో 60 శాతం తక్కువగా ఉన్నట్లు ప్రభుత్వం గుర్తించింది. సోయా పంటనే ఉదాహరణగా తీసుకుంటే కొత్త వెరైటీలు (2021లో రిలీజైన డీఎస్‌బీ-34, ఎంఏసీఎస్-1460 వెరైటీ) తో ఎకరానికి 12 క్వింటాళ్ల దిగుబడి వస్తుందని శాస్త్రవేత్తలు చెబుతున్నారు.

స్వయం సమృద్ధి సాధించేలా..

ప్రస్తుతం రాష్ట్రంలో వరి, పత్తి, మొక్కజొన్న వంటి పంటలనే ఎక్కువగా సాగు చేస్తున్నారు. ఈ రైతులు నూనెగింజల సాగు వైపు మొగ్గు చూపేలా చేయడమే లక్ష్యంగా ప్రభుత్వం ఈ పథకాన్ని అమలు చేస్తోంది. మరోవైపు దేశంలో నూనెగింజల ఉత్పత్తి చాలా తక్కువగా ఉంది. వివిధ దేశాల నుంచి నూనె గింజలను దిగుమతి చేసుకోవాల్సి వస్తోంది. ఈ నేపథ్యంలో ఈ నూనెగింజల ఉత్పత్తిలో స్వయం సమృద్ధి సాధించడమే లక్ష్యంగా ప్రభుత్వం ఈ పథకానికి శ్రీకారం చుట్టింది.

పథకం అమలుకు నిర్దేశించిన లక్ష్యం

పంట	విస్తీర్ణం (ఎకరాల్లో..)
వేరుశెనగ	: 36,250
కుసుమ	: 3,000
నువ్వులు	: 15,000
సోయాబీన్	: 26,000
పొద్దుతిరుగుడు	: 12,625
మొత్తం	: 92,875

పంటల వారీగా ఎంపిక చేసిన జిల్లాలు

సోయాబీన్ : సంగారెడ్డి, ఆదిలాబాద్, నిర్మల్, కామారెడ్డి, నిజామాబాద్, కొమురంభీం ఆసిఫాబాద్

పొద్దుతిరుగుడు : సంగారెడ్డి, మెదక్, సిద్దిపేట, కామారెడ్డి, నిజామాబాద్, భద్రాద్రి, రంగారెడ్డి, రాజన్న సిరిసిల్ల, మహబూబాబాద్, కరీంనగర్, నిర్మల్, పెద్దపల్లి

వేరుశనగ : నల్లగొండ, నాగర్‌కర్నూల్, వనపర్తి, జోగుళాంబ, మహబూబ్‌నగర్, వికారాబాద్, నారాయణపేట

కుసుమ : సంగారెడ్డి, రంగారెడ్డి, వికారాబాద్

నువ్వులు : జగిత్యాల, నిర్మల్, నిజామాబాద్

రాష్ట్రంలో ప్రస్తుతం నూనె గింజల సాగు ఇలా..

రాష్ట్రంలో నూనె గింజల సాధారణ సాగు విస్తీర్ణం	: 4.79 లక్షల ఎకరాలు
గతేడాది (2024) ఖరీఫ్‌లో సాగైన విస్తీర్ణం	: 4.27 లక్షల ఎకరాలు

న్యూస్‌రీల్

అసైన్డ్ భూములపై సర్వహక్కులు కల్పించాలి



మాట్లాడుతున్న అబ్దుల్ రహీం

నారాయణఖేడ్: రాష్ట్రంలో అసైన్డ్ భూములు కలిగి ఉన్న రైతులకు 1977 పీవోటీ చట్టాన్ని రద్దుచేసి భూములపై సర్వహక్కులు కల్పించాలని అంబేడ్కర్, పూలే సేవాసమితి రాష్ట్ర అధ్యక్షుడు అబ్దుల్ రహీం ప్రభుత్వాన్ని కోరారు. ఖేడ్‌లోని సంఘం కార్యాలయంలో శనివారం నిర్వహించిన సంఘం జిల్లాస్థాయి సమావేశంలో ఆయన మాట్లాడుతూ...గతంలో కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలలో మిగులు, ప్రభుత్వ భూములను భూమిలేని నిరుపేదలకు అసైన్డ్ చేశారన్నారు. బీఆర్‌ఎస్ అధికారంలోకి వచ్చాక అసైన్డ్ భూములను రైతుల నుంచి బలవంతంగా లాక్కుని పల్లె ప్రకృతివనాలు, డంపింగ్ యార్డులు, వైకుంఠ ధామాలు, క్రీడా ప్రాంగణాలకు కేటాయించి పేదరైతులకు తీరని అన్యాయం చేశారని ఆవేదన వ్యక్తం చేశారు.

ఆదరణను చూసి ఓర్వలేకే విమర్శలు



మాట్లాడుతున్న ప్రకాశ్ రాథోడ్

నారాయణఖేడ్: కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో ప్రజల్లో పెరుగుతున్న ఆదరణను ఓర్వలేకే బీఆర్‌ఎస్ నాయకులు అసత్యపు ఆరోపణలు, విమర్శలు చేస్తూ ప్రజలను మభ్యపెట్టే ప్రయత్నాలు చేస్తున్నారని జిల్లా అభివృద్ధి కో-ఆర్డినేషన్ కమిటీ (దిశ) సభ్యులు ప్రకాష్ రాథోడ్ విమర్శించారు. ఖేడ్‌లో ఆదివారం విలేకరులతో మాట్లాడుతూ రైతు భరోసా, రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్ల విషయంలో మాజీ మంత్రి హరీశ్‌రావు, ఖేడ్ మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డిలకు మాట్లాడే నైతికహక్కు లేదన్నారు. పదేళ్లు పాలించి ఒక్క కొత్త రేషన్ కార్డూ ఇవ్వలేదన్నారు. డబుల్‌బెడ్‌రూం ఇళ్లపేరుతో మభ్యపెట్టారే తప్ప పేదలకు చేసిందేమీలేదన్నారు. నిరుద్యోగులకు ఉద్యోగాలు కల్పించలేదన్నారు.

డంప్‌యార్డ్‌పై కొనసాగుతున్న నిరసనలు



నిరాహార దీక్షలో పాల్గొన్న స్థానిక మహిళలు

జిన్నారం (పటాన్‌చెరు): గుమ్మడిదల మండలం నల్లవల్లి గ్రామపంచాయతీ పరిధిలోని ప్యారానగర్ డంపింగ్ యార్డ్ ఏర్పాటుకు వ్యతిరేకంగా జేఏసీ ఆధ్వర్యంలో చేపట్టిన నిరసనలు 138వ రోజుకు చేరుకున్నాయి. నల్లవల్లి గ్రామంలో ఏర్పాటు చేసిన రిలే నిరాహార దీక్షలో స్థానిక మహిళలు పాల్గొని సంఘీభావం తెలిపారు. పచ్చని అడవిలో డంపింగ్ యార్డ్ ఏర్పాటుచేస్తే పర్యావరణానికి విఘాతం కలుగుతుందని, స్థానిక ప్రజల జీవనంపై తీవ్ర ప్రభావం చూపుతుందన్నారు. డంపింగ్‌యార్డ్ నిర్మాణ పనులు నిలిపేవరకు తమ ఆందోళనలు కొనసాగుతాయని స్పష్టం చేశారు.

పెండింగ్ బిల్లులు చెల్లించాలి

సదాశివపేట రూరల్ (సంగారెడ్డి): గత బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో చేసిన పనులకు మాజీ సర్పంచులకు పెండింగ్ బిల్లులను ప్రభుత్వం వెంటనే చెల్లించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి జలాలుద్దీన్ డిమాండ్ చేశారు. పట్టణంలోని సీపీఐ కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన సీపీఐ 6వ మండల మహాసభకు ఆయన హాజరై మాట్లాడారు. పేదలకు ప్రభుత్వ స్థలాల్లో ఇళ్లు లేని వారికి 100 గజాల ఇంటి స్థలాలు కేటాయించాలని కోరారు.

రూ.298.43 కోట్లు రైతుల ఖాతాల్లో జమ

జిల్లా వ్యవసాయాధికారి శివప్రసాద్

సంగారెడ్డి జోన్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న రైతు భరోసా పథకం ద్వారా జిల్లాలో 3,12,879 మంది రైతుల ఖాతాల్లో రూ.298.43కోట్లు నిధులు జమ చేసినట్లు జిల్లా వ్యవసాయాధికారి శివప్రసాద్ ఆదివారం ఓ ప్రకటనలో వెల్లడించారు. 2025 వానాకాలం సీజన్ సాగు కోసం పంట పెట్టుబడి సాయం కింద ప్రభుత్వం జిల్లావ్యాప్తంగా 3,73,910 మంది రైతులకు రూ.374 కోట్ల నిధులను నేరుగా వారి బ్యాంకు ఖాతాలలో జమ చేస్తోందన్నారు.

ప్రణాళికాబద్ధంగా డివిజన్ల అభివృద్ధి

పలు అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి శంకుస్థాపన



నిర్మాణ పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే

పటాన్‌చెరు: పటాన్‌చెరు డివిజన్ పరిధిలోని ప్రతీ కాలనీకి ప్రణాళికాబద్ధంగా నిధులు కేటాయిస్తూ, అభివృద్ధి చేస్తున్నామని ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి పేర్కొన్నారు. పటాన్‌చెరు డివిజన్ పరిధిలోని శాంతినగర్ కాలనీ,అంబేడ్కర్ కాలనీ, బండ్లగూడ కాలనీలలో రూ.కోటి అంచనా వ్యయంతో నిర్మించతలపెట్టిన అంతర్గత మురుగునీటి కాలువల నిర్మాణ పనులకు ఆదివారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..పటాన్‌చెరు డివిజన్ పరిధిలో నూతనంగా ఏర్పాటవుతున్న కాలనీలలో మౌలిక వసతుల కల్పనకు పెద్ద ఎత్తున నిధులు కేటాయిస్తున్నామని తెలిపారు.

దేవాలయ వార్షికోత్సవానికి ఆహ్వానం

పటాన్‌చెరు డివిజన్ ముదిరాజ్ బస్తీలోని పోచమ్మ తల్లి దేవాలయం 5 వ వార్షికోత్సవానికి హాజరు కావాలని ఆలయ కమిటీ సభ్యులు ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డిని ఆహ్వానించారు. ఈ మేరకు ఆహ్వాన పత్రికను ఆయనకు అందజేశారు.

అక్కడ పని..ఇక్కడ వేతనం

అక్రమ డిప్యుటేషన్లు రద్దయ్యేనా!

- పలు శాఖల్లో వేధిస్తున్న సిబ్బంది కొరత
- పని ఒత్తిడితో అధికారులు సతమతం
- డిప్యూటేషన్ అధికారులదే హవా
- పట్టించుకోని ఉన్నతాధికారులు



ఝరాసంగంలోని ఎంపీపీ కార్యాలయం

ఝరాసంగం(జహీరాబాద్): మండలంలోని పలువురు అధికారులు నిబంధనలకు విరుద్ధంగా డిప్యూటేషన్లపై కొనసాగుతున్నారు. పలు శాఖల అధికారులు, ఉద్యోగులు తమకు నచ్చిన ప్రదేశాల్లో విధులు నిర్వహిస్తూ తమ హవాను సాగిస్తున్నారు. ఒక చోట విధులను నిర్వహిస్తూ మరో చోట వేతనాలు పొందుతున్నారు. దీంతో స్థానిక కార్యాలయాల్లో సిబ్బంది కొరత ఏర్పడి ప్రజలకు అందించే సేవలతోపాటు కార్యాలయాల సేవలు ఆలస్యం అవుతున్నాయి. ఆయా కార్యాలయాల్లో విధులు నిర్వహిస్తున్న అధికారులతో పాటు ప్రజలు తీవ్ర స్థాయిలో ఇబ్బందులు పడుతున్నారు.

పలు శాఖల్లో డిప్యూటేషన్లు ఇలా..

మండల ప్రజాపరిషత్తు కార్యాలయంలో పేరుకు మాత్రం అన్ని పోస్టులు భర్తీగానే ఉన్నాయి కానీ కార్యాలయంలో విధి నిర్వహణలో మాత్రం ఖాళీ కుర్చీలే దర్శనమిస్తున్నాయి. ఇక్కడి కార్యాలయంలో విధులు నిర్వహించాల్సిన సూపరింటెండెంట్ రాములు పుల్‌కల్ మండలానికి వెళ్లగా ఇతర కార్యాలయం నుంచి ఇక్కడికి వచ్చిన శంకర్ చౌటకూర్ మండలానికి వెళ్లారు. టైపిస్ట్ వెంకటయ్య కొండాపూర్ మండలానికి వెళ్లారు. ఇదే కార్యాలయంలో ఆఫీస్ సబార్డినేట్ న్యాల్‌కల్ మండల పరిషత్తు కార్యాలయానికి వెళ్లగా తిరిగి అక్కడి నుంచి అదే మండలంలోని మిర్జాపూర్(బి)లోని జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలకు వెళ్లారు. తహసీల్దార్ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్న బీరప్ప కోహీర్ కార్యాలయం నుంచి వచ్చారు. ఈయన గతంలో ఝరాసంగంలో వీఆర్‌ఏగా విధులు నిర్వహించి పదోన్నతిపై కోహీర్‌కు వెళ్ళారు. తిరిగి ఇదే మండలానికి రావటంతో పలు విమర్శలు వస్తున్నాయి. తాను చెప్పిందే వేదంగా కార్యాలయంలో కొనసాగిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రజలకు మెరుగైన వైద్యంతోపాటు ఆయుష్ సేవలు అందించాలనే లక్ష్యంతో నియమించిన అధికారి డా. గోపీ మేడ్చల్ జిల్లాలోని షామిర్‌పేటలో డిప్యూటేషన్‌పై విధులు నిర్వహిస్తున్నారు. ఇవే కాకుండా ఇతర శాఖల్లో కూడా డిప్యూటేషన్లు కొనసాగుతున్నాయి. వీరికంతా ఇక్కడినుండే హాజరు నివేదికలు పంపి, వేతనాలు అందిస్తున్నారు.

వివిధ రకాలుగా ఇబ్బందులు

అధికారులు, సిబ్బంది డిప్యూటేషన్లపై ఇతర ప్రాంతాల్లో విధులు నిర్వహించటంతో పలు రకాల ఇబ్బందులు తలెత్తుతున్నాయి. సిబ్బంది కొరత ఉండటంతో సమయానికి పనులు పూర్తి కావడం లేదు. అదేవిధంగా స్థానికంగా ఉన్న అధికారులపై పని భారం ఎక్కువ అవుతుందనే ఇతర అధికారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. త్వరలో పరిషత్తు ఎన్నికలతోపాటు పంచాయతీ ఎన్నికలను నిర్వహించనున్నారు. ఈ నేపథ్యంలో ప్రస్తుతం ఉన్న అధికారులపై మరింతగా పనిభారం పెరిగే అవకాశాలున్నాయి.

ఫిర్యాదు చేసినా చర్యలేవీ?

డిప్యూటేషన్లపై అధికారులు ఏ మాత్రం పట్టించుకోవటంలేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. పలుమార్లు రద్దు చేసి యథాస్థానాల్లో విధులు కేటాయించాలనే ఫిర్యాదులు చేసినా పట్టించుకోవటం లేదని అధికారుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు చర్యలు తీసుకుని డిప్యూటేషన్లు రద్దు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

ప్రొవిజన్ జాబితా విడుదల



సంగారెడ్డి: సంగారెడ్డి జిల్లా వైద్యాధికారి కార్యాలయంలో వివిధ పోస్టుల నియామకానికి ప్రొవిజన్ జాబితాను ఆదివారం విడుదల చేశారు. ఈ జాబితాను కలెక్టర్ వెబ్‌సైట్‌లో పొందుపరిచారు. ఏమైనా అభ్యంతరాలు ఉంటే ఈ నెల 23 సాయంత్రం 5 గంటల వరకు జిల్లా వైద్యాధికారి కార్యాలయంలో సమర్పించాలని డీఎంహెచ్‌ఓ డాక్టర్ గాయత్రీ దేవి ఓ ప్రకటనలో వెల్లడించారు.

వర్షాలకోసం పాదయాత్ర

భూలక్ష్మమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు



పాదయాత్ర చేస్తున్న రైతులు, మహిళలు

నారాయణఖేడ్: వరుణుడు కరుణించి వర్షాలు కురిపించాలని కోరుతూ మనూరు మండలం ఎల్గోయి, అతిమ్యాల్ గ్రామాలకు చెందిన రైతులు ఆదివారం ఆయా గ్రామాల నుంచి తలలపై నిండు కలశాలు, తులసీ కోటలతో భజనలు చేస్తూ పాదయాత్ర చేపట్టారు. ఖేడ్ మండలం తుర్కాపల్లి శివారులోని భూలక్ష్మమ్మ ఆలయాన్ని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. గత 11 ఏళ్లుగా పాదయాత్ర కొనసాగిస్తున్నామని వారు తెలిపారు. వారికి తుర్కాపల్లి మాజీ సర్పంచ్ పరమేశ్వర్, కేతకీ సంగమేశ్వర ఆలయ డైరెక్టర్ ఈశ్వరప్ప, మాజీ ఎంపీటీసీ దత్తుగౌడ్, దామోదర్, శ్రీనివాస్‌రెడ్డి, భూమయ్య, గ్రామ పెద్దలు స్వాగతం పలికారు. ఎల్గోయి, అతిమ్యాల్ మాజీ సర్పంచులు విఠల్‌రావు, నర్సింలు, అశోక్‌రావు ఉన్నారు.

ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పించాలి

పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న రామ్మోహన్‌రెడ్డి

సదాశివపేట రూరల్ (సంగారెడ్డి): రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లి అవగాహన కల్పించి రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ అభ్యర్థుల విజయానికి కాంగ్రెస్ ప్రజాప్రతినిధులు నాయకులు కృషి చేయాలని పరిగి ఎమ్మెల్యే జిల్లా అబ్జర్వర్ టీపీసీసీ జనరల్ సెక్రటరీ రామ్మోహన్‌రెడ్డి, టీజీఐఐసీ చైర్మన్ నిర్మలారెడ్డి కార్యకర్తలకు సూచించారు. పట్టణంలోని బసవ సేవా ఫంక్షన్ హాల్‌లో ఆదివారం కాంగ్రెస్ ముఖ్య కార్యకర్తల సమావేశానికి వారు హాజరై మాట్లాడారు. రాష్ట్రంలో మళ్లీ రాబోయేది కాంగ్రెస్ ప్రభుత్వమేనన్నారు.

పారదర్శక ఎన్నికలకు శ్రీకారం

- సంస్కరణల దిశగా ఈసీ
- అన్ని కేంద్రాల్లోనూ ఇక వెబ్‌కాస్టింగ్
- వెబ్‌కాస్టింగ్ మానిటరింగ్, కంట్రోల్ రూంలు



నారాయణఖేడ్: రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహిస్తారన్న వార్తల నేపథ్యంలో గ్రామాల్లో ఎక్కడ చూసినా ఎన్నికల హడావుడి, వేడి మొదలైంది. కేంద్ర ఎన్నికల సంఘం కూడా ఎన్నికలను పారదర్శకంగా నిర్వహించేందుకు ఎప్పటికప్పుడు పలు సంస్కరణలు చేపడుతోంది. ఈ మేరకు రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్‌రెడ్డి ఈ విషయాన్ని ఇటీవల వెల్లడించారు. ఈ నెల 26, 27వ తేదీల్లో తెలంగాణ అధికారులకు ఢిల్లీలో కేంద్ర ఎన్నికల సంఘం శిక్షణ ఇవ్వనుంది. నేషనల్ లెవల్ లీగల్ కాన్ఫరెన్స్ కోసం ముగ్గురు న్యాయవాదులకు శిక్షణనిస్తున్నారు. మొత్తమ్మీద కేంద్ర, రాష్ట్ర ఎన్నికల సంఘాలు ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో పారదర్శకంగా నిర్వహించేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నారు. ఇదే సమయంలో ఓటర్లకు ఇబ్బందులు కలుగకుండా ఉండేందుకూ పలు సంస్కరణలకు శ్రీకారం చుడుతున్నారు.

1,200 మందికే పోలింగ్ కేంద్రం

ఎన్నికల్లో పోలింగ్ కేంద్రాలు ఓటర్లకు సమీపంలో ఏర్పాటు చేయడం, ఓటింగ్ శాతం పెంచడం కోసం ఎన్నికల సంఘం చర్యలు చేపట్టింది. అందులో భాగంగా తాజాగా 1,200మంది ఓటర్లకు ఒక్కో పోలింగ్ కేంద్రం ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆదేశాలు జారీ చేసింది. ఇప్పటివరకు ఒక్కో పోలింగ్ కేంద్రంలో 1,500 మంది ఓటర్లు ఉండేవారు. పోలింగ్ కేంద్రం పరిధిలో ఓటర్ల సంఖ్యను తగ్గించేలా చర్యలు చేపట్టారు. దీంతో ఉమ్మడి మెదక్ జిల్లాలో పోలింగ్ కేంద్రాల సంఖ్య పెరిగేందుకు ఆస్కారం ఏర్పడనుంది. ఓటర్ల నివాసాలకు 2కిలోమీటర్ల పరిధిలోనే పోలింగ్ కేంద్రం ఉండేలా ఏర్పాట్లు చేస్తున్నారు. బహుళ అంతస్తులు, సంక్షేమ సంఘాల వద్ద కూడా కొత్త పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయనున్నారు. పోలింగ్ కేంద్రాల వద్ద సెల్‌ఫోన్లను భద్రపరిచేందుకు ప్రత్యేక కౌంటర్లను ఏర్పాటు చేయనున్నారు. ఓటర్లు పోలింగ్ కేంద్రాల వద్ద ఓటింగ్ కోసం గంటల తరబడి వేచి ఉండటం వంటి ఇబ్బందుల దృష్ట్యా చాలామంది ఓటింగ్‌కు దూరం అవుతున్నారు. దీంతో పోలింగ్ శాతం తగ్గుతోంది. దీన్ని నివారించేందుకు 1,200మందికే ఒక పోలింగ్ కేంద్రం ఏర్పాటు చేయడం, 2కిలోమీటర్ల దూరంలోనే పోలింగ్ కేంద్రం ఉండటం వల్ల గ్రామీణస్థాయి నుంచి పట్టణాల వరకు ఓటింగ్ శాతం పెరగడమే కాకుండా ఓటర్లు అధిక సంఖ్యలో ఓటింగ్‌లో చురుగ్గా పాల్గొనే అవకాశం ఉందని ఈసీ భావిస్తోంది.

ఉమ్మడి జిల్లాలో ప్రస్తుతం ఉన్న పోలింగ్ కేంద్రాలు, ఓటర్ల వివరాలు

జిల్లా	పోలింగ్ కేంద్రాలు	ఓటర్లు
సంగారెడ్డి	1,633	14,40,151
మెదక్	586	4,51,225
సిద్దిపేట	1,157	9,77,924

పక్షం రోజుల్లో ఓటరు కార్డు..

ఓటరు గుర్తింపు కార్డుల జారీ ప్రక్రియను వేగవంతం చేస్తూ కేంద్ర ఎన్నికల సంఘం నిర్ణయం తీసుకుంది. ఇకపై దరఖాస్తు చేసుకున్న 15 రోజుల్లోనే ఓటర్‌ఐడీ కార్డులను అందజేయనుంది. కొత్తగా ఓటు హక్కు కోసం నమోదు చేసుకున్న వారికి, అలాగే తమ ఓటర్ కార్డులోని వివరాలలో మార్పులు కోరిన వారికి ఇది వర్తిస్తుందని స్పష్టం చేసింది.



అన్ని కేంద్రాల్లో కెమెరాలతో నిఘా

రానున్న ఎన్నికల నుంచి ఓటింగ్ జరిగే అన్ని పోలింగ్ కేంద్రాల్లోనూ ఎన్నికల ప్రక్రియను వెబ్‌కాస్టింగ్ చేయాలని ఎన్నికల సంఘం నిర్ణయించింది. ఇప్పటివరకు సమస్యాత్మకమైనవిగా భావించే వాటితోసహా 50% పోలింగ్ కేంద్రాల్లో మాత్రమే దీన్ని నిర్వహించేవారు. వెబ్‌కాస్టింగ్ ద్వారా నమోదు చేసిన సమాచారాన్ని ఎన్నికల సంఘం అంతర్గత అవసరాలకు వినియోగించుకోనుంది. వందశాతం కేంద్రాల్లో వెబ్‌కాస్టింగ్ కోసం రాష్ట్రాల ముఖ్య ఎన్నికల అధికారులకు ఈసీ తెలియజేసింది. రాష్ట్ర స్థాయిలో, ప్రతీ జిల్లాలో, అన్ని నియోజక వర్గాల స్థాయిల్లోనూ వెబ్‌కాస్టింగ్ మానిటరింగ్, కంట్రోల్ రూంలు ఏర్పాటు చేస్తుంది. ప్రతీ స్థాయిల్లోనూ నోడల్ అధికారి పర్యవేక్షణ ఉంటుంది. వెబ్‌కాస్టింగ్ కోసం ఇంటర్నెట్ సదుపాయాన్ని వినియోగించుకోనుంది. ఆ సదుపాయం లేని చోట ప్రత్యామ్నాయ ఏర్పాట్లలో భాగంగా వీడియో చిత్రీకరణ, ఫోటోలు తదితరాలపై ఆధారపడనుంది.

కార్మికుల ఐక్యతతోనే హక్కులు సాధ్యం

సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు చుక్కా రాములు

పటాన్‌చెరు టౌన్: కార్మికులంతా ఐక్యంగా ఉండాలని ఐక్యంగా ఉంటేనే సమస్యలు పరిష్కారం అవుతాయని చారిత్రాత్మకమైన వేతన ఒప్పందాలు సీఐటీయూకే సాధ్యమని సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు, కిర్బీ యూనియన్ అధ్యక్షుడు చుక్కా రాములు పేర్కొన్నారు. పటాన్‌చెరులోని ఐలాభవన్‌లో ఆదివారం జరిగిన కిర్బీ కార్మికుల సమావేశానికి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా రాములు మాట్లాడుతూ.. అనేక పరిశ్రమలలో ఏ యూనియన్ చేయలేని చారిత్రాత్మకమైన వేతన ఒప్పందాలు సీఐటీయూకే సాధ్యమయ్యాయన్నారు. ఇప్పటికి రెండు మంచి వేతన ఒప్పందాలు సాధించామని, కార్మికులకు కొత్త సౌకర్యాలు, చట్టపరమైన హక్కులు కార్మికులకు కల్పించినట్లు తెలిపారు. కిర్బీ పరిశ్రమతో జరగనున్న వేతన ఒప్పందంలో కూడా అనేక ఇతర సౌకర్యాలు సాధిస్తామని చెప్పారు. కార్యక్రమంలో యూనియన్ వర్కింగ్ ప్రెసిడెంట్ రాజయ్య, మాణిక్యం, జనరల్ సెక్రెటరీ వి.ఎస్ రాజు, యూనియన్ నాయకులు మల్లేశ్, నాగప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

47 మందిపై కేసులు నమోదు



డ్రంకెన్ డ్రైవ్ టెస్టు చేస్తున్న పోలీసులు

సిద్దిపేటకమాన్: పట్టణ పోలీసు కమిషనరేట్ పరిధిలో పోలీసులు ఆదివారం నిర్వహించిన ఆకస్మిక వాహన తనిఖీల్లో 47 డ్రంకెన్ డ్రైవ్ కేసులు నమోదు చేసినట్లు సీపీ అనురాధ తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కమిషనరేట్ పరిధిలోని రాజీవ్ రహదారిపై, ఇతర ప్రాంతాల్లో పోలీసు సిబ్బంది ఆదివారం సాయంత్రం 5నుంచి 7 గంటల వరకు ఆకస్మిక వాహనాల తనిఖీ నిర్వహించారు. జిల్లా వ్యాప్తంగా 47 డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులతో పాటు ట్రాఫిక్, రోడ్డు నిబంధనలు ఉల్లంఘించిన వాహనదారులపై 65 ఈ పెట్టి కేసులతో పాటు మొత్తం 375 కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. వాహన తనిఖీల్లో సీఐలు వాసుదేవారావు, ఉపేందర్, శ్రీను, సైదా, లతీఫ్, మహేందర్‌రెడ్డి, ప్రవీణ్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

నిజాయితీ చాటుకున్న ఆర్టీసీ సిబ్బంది

బస్టాండ్‌లో మరిచిపోయిన బ్యాగు అప్పగింత



బ్యాగును అందజేస్తున్న ఆర్టీసీ సిబ్బంది

హుస్నాబాద్: ఆర్టీసీ సిబ్బంది విధి నిర్వహణలో తమ నిజాయితీ చాటుకున్నారు. వివరాల్లోకి వెళ్తే... హుస్నాబాద్ బస్టాండ్‌లో బస్సు ఎక్కిన ఓ మహిళా ప్రయాణికురాలు బస్టాండ్‌లోనే బ్యాగు మరిచిపోయింది. రద్దీగా ఉండటంతో బస్సు సీటు ఆపడం కోసం బస్సు ఎక్కింది. గ్రామానికి వెళ్లాక బ్యాగు మర్చిపోయినట్లు గుర్తించి ఆర్టీసీ సిబ్బందికి సమాచారం అందించింది. సమాచారం అందిన వెంటనే బ్యాగు రికవరీ చేసిన ఆర్టీసీ సిబ్బంది తిరిగి ప్రయాణికురాలి కుటుంబ సభ్యులకు బ్యాగును సురక్షితంగా అప్పగించారు. బ్యాగులో ఉన్న రెండున్నర తులాల బంగారు పుస్తెల తాడు, 20 తులాల వెండి, రూ.15వేలు నగదు ఉన్నాయి. ఆర్టీసీ సిబ్బందికి ప్రయాణికురాలు, ఆమె కుటుంబసభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్‌కు గజ్వేల్ క్రీడాకారులు



రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ టోర్నమెంట్‌కు ఎంపికైన క్రీడాకారులు

గజ్వేల్‌రూరల్: రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ టోర్నమెంట్‌కు గజ్వేల్ ఫుట్‌బాల్ అసోసియేషన్‌కు చెందిన క్రీడాకారులు ఎంపికైనట్లు జీఎఫ్‌ఏ(గజ్వేల్ ఫుట్‌బాల్ అసోసియేషన్) అధ్యక్షుడు గంగిశెట్టి రవీందర్ తెలిపారు. ఈ సందర్భంగా ఆదివారం గజ్వేల్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ... మెదక్‌లోని ఇందిరాగాంధీ స్టేడియంలో శనివారం తెలంగాణ ఫుట్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఉమ్మడి మెదక్ జిల్లా స్థాయి అండర్ -15 బాలుర ఎంపికలు జరిగాయి. ఈ ఎంపికలో గజ్వేల్ ఫుట్‌బాల్ అసోసియేషన్‌కు చెందిన క్రీడాకారులు కే.సాయి, సీహెచ్.సుశాంత్. ఎం.కార్తీక్ ఎంపికైనట్లు తెలిపారు. ఈనెల 28 నుంచి జూలై 1వరకు నిజామాబాద్‌లో జరిగే రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ టోర్నమెంట్‌లో పాల్గొననున్నట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఎంపికైన క్రీడాకారులతో పాటు కోచ్ నాగేష్‌ను అభినందించారు. ఈ కార్యక్రమంలో జీఎఫ్‌ఏ ప్రతినిధులు నరేష్, శ్రీనివాస్, సతీష్, శ్రీకాంత్, మహేష్ పాల్గొన్నారు.

కుక్కల దాడి.. లేగదూడ మృతి

రేగోడ్(మెదక్): కుక్కల దాడిలో ఓ లేగదూడ మృతి చెందింది. ఈ ఘటన మండలంలోని మర్పల్లి గ్రామంలో శనివారం రాత్రి చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన రైతు భూంరెడ్డికి చెందిన ఆవుకు ఇటీవల ఓ లేగదూడ జన్మించింది. మూడు రోజుల ఆ దూడపై కుక్కలు పైశాచికంగా దాడిచేసి పీక్కుతిన్నాయి. గమనించిన స్థానికులు కుక్కలను వెంబడించి తరిమేశారు. గతంలో కూడా పలువురిపై కుక్కలు దాడి చేశాయని గ్రామస్తులు తెలిపారు. కుక్కలను నివారించాలని గతంలో అధికారులకు వినతిపత్రం అందజేశామన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి నివారణ చర్యలు తీసుకోవాలని కోరారు.

వ్యక్తి ఆత్మహత్య

జిన్నారం (పటాన్‌చెరు): అనారోగ్యంతో వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన బొల్లారం పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. సీఐ రవీందర్ రెడ్డి వివరాల ప్రకారం... నగర పరిధిలోని వైఎస్ఆర్ కాలనీలో నివాసముండే గొల్ల నారాయణ రావు కొంత కాలంగా కంటి సమస్యతో బాధపడుతున్నాడు. కాగా పలు ఆస్పత్రుల్లో చికిత్స చేయించినా తగ్గకపోవడంతో శనివారం అర్ధరాత్రి ఇంట్లో ఉరివేసుకున్నాడు. మృతుడి కొడుకు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వాన కురవక.. సాగు సాగక

అన్నదాతల ఎదురు చూపులు

- ఇప్పటివరకు 42,191 ఎకరాల్లోనే సాగు
- ఎండుతున్న మొలకలు
- జూలై పైనే రైతన్నల ఆశలు



ఈ ఫొటోలో కనిపిస్తున్న వ్యక్తి దుబ్బాకకు చెందిన రైతు ఎంకమ్మగారి నారాయణరెడ్డి. వానలు లేక ఇప్పటి వరకు వరినారు పోయలేదు. బోరు బావి పెట్టి నారు పోద్దామంటే వానలు లేవు తూకం పోస్తే దుక్కులు ఎలా పారుతాయి. దున్నడం ఎట్లా అనే పరేషాన్‌లో ఉండు. వానాకాలం ప్రారంభమై నెల రోజులు గడుస్తున్నా పెద్ద వానలు కొట్టకపోవడంతో నార్లు పోయ లేదు. ఎప్పుడు వానలు పడతాయో తోస్తలేదంటూ ఆవేదన వ్యక్తం చేసిండు. ఇది ఒక్క రైతు నారాయణరెడ్డి బాధనే కాదు జిల్లాలోని అందరి అన్నదాతల ఆవేదన ఇదే.



ఎల్లారెడ్డిపేటలో స్ప్రింక్లర్ల ద్వారా మొక్కజొన్న మొలకలకు నీరు పడుతున్న రైతు

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట)/దుబ్బాక: సిద్దిపేట జిల్లాలో పంటల సాగు పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. ఏప్రిల్‌లో ముందస్తుగా వర్షాలు కురవడంతో రైతులు సంబురపడ్డారు. జూన్‌లో మాత్రం ముఖం చాటేశాయి. అప్పుడప్పుడు కురిసిన చిరుజల్లులకు రైతులు పలు చోట్ల విత్తనాలు విత్తారు. కానీ కొద్ది రోజులుగా వర్షాలు కురవకపోవడంతో రైతులు ఆకాశం వైపునకు ఆశగా ఎదురు చూస్తున్నారు. ఆలస్యంగా వేసిన విత్తనాలు భూమిలో తడి లేకపోవడంతో మొలకెత్తడం లేదు.

ఈ వానాకాలంలో జిల్లాలో 5.60 లక్షల ఎకరాల్లో పంటలు సాగవుతాయని వ్యవసాయశాఖ అధికారులు అంచనా వేశారు. కానీ ఇప్పటి వరకు కేవలం 42,191 ఎకరాల్లో మాత్రమే రైతులు విత్తనాలు విత్తారు. 1.10లక్షల ఎకరాల్లో పత్తి సాగు అవుతుందని వ్యవసాయశాఖ అంచనా వేయగా 37,609 ఎకరాల్లో మాత్రమే పత్తి సాగు చేశారు. అలాగే వరి 3.75లక్షల ఎకరాల్లో సాగు అంచనా వేయగా 174 ఎకరాల్లో నాట్లు వేశారు. 30 వేల ఎకరాల్లో మొక్కజొన్న సాగు చేస్తారని అంచనా వేయగా నేటి వరకు 4253 ఎకరాల్లో విత్తనాలు వేశారు. కందులు-135 ఎకరాలు, పెసర-20 ఎకరాల్లో సాగు చేస్తున్నారు. వర్షాలు సక్రమంగా కురవకపోవడంతో రైతులు ఆవేదన చెందుతున్నారు.

డ్రిప్, స్ప్రింక్లర్ల ద్వారా నీరు

జూన్‌లో విత్తిన విత్తనాల ద్వారా మొలకెత్తిన మొలకలను రక్షించుకునేందుకు నీటి సౌకర్యం ఉన్న రైతులు డ్రిప్, స్ప్రింక్లర్ల ద్వారా పంటకు నీరు అందిస్తున్నారు. దీంతో నీరు లేని రైతులు మాత్రం వరుణుడి రాక కోసం ఆశతో ఎదురు చూస్తున్నారు. చిన్న చిరుజల్లులు పడినప్పటికీ మొలక పెరిగే దశలో వర్షాలు లేకపోతే ఇబ్బందులు పడాల్సి వస్తుందనే విధంగా రైతులు సాగుకు వెనకడుగు వేస్తున్నారు. సకాలంలో విత్తకపోతే పంటకు తెగులు, దిగుబడి తగ్గే అవకాశం లేకపోలేదని రైతులు వాపోతున్నారు.

రైతులు తొందరపడొద్దని, దుక్కులు దున్ని సిద్ధం చేసుకుని, వర్షాలు పడగానే విత్తనాలు విత్తుకోవాలని వ్యవసాయశాఖ అధికారులు సూచిస్తున్నారు.

ఇప్పటికే వర్షాలు కురిసేవి



జూన్‌లో వర్షాలు ప్రారంభమయ్యేవి. ఏప్రిల్‌లో వర్షాలు కురవడంతో సంబురపడ్డాం. కానీ ఆశించిన మేర కురవడం లేదు. చిరుజల్లులు మాత్రమే అప్పుడప్పుడు వస్తున్నాయి. రైతులు ఆకాశం వైపు చూడాల్సిన పరిస్థితి నెలకొంది. దీంతో స్ప్రింక్లర్‌లు, డ్రిప్‌ల ద్వారా పంటలకు నీరు అందించాల్సి వస్తుంది.

-రాజిరెడ్డి, రైతు, మాచాపూర్

జూలై 15 వరకు విత్తుకోవచ్చు



జిల్లాలో పలు చోట్ల రైతులు విత్తనాలు విత్తారు. జూలై 15 వరకు విత్తుకునే అవకాశం ఉంది. అందువల్ల మంచి వర్షాలు కురిశాకే విత్తనాలు వేయాలి. కందులు సెప్టెంబర్ వరకు విత్తుకోవచ్చు. మొక్కజొన్న సంవత్సరం పొడవున విత్తుకునే అవకాశం ఉంది. రైతులు అధైర్యపడొద్దు. వర్షాలు కురవకపోతే ప్రత్యామ్నాయ పంటలపై దృష్టి సారించాలి.

-రాధిక, జిల్లా వ్యవసాయశాఖ అధికారి

బిడ్డకు జన్మనిచ్చి... కన్ను మూసిన తల్లి

అల్వాలలో విషాదం



వాణి

మిరుదొడ్డి(దుబ్బాక): పండంటి మగ బిడ్డకు జన్మనిచ్చిన తల్లి తీవ్ర అస్వస్థతకు గురై కన్ను మూసింది. ఈ విషాదకర ఘటన మండల పరిధిలోని అల్వాలలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం... గ్రామానికి చెందిన మంగళి లింగం, వాణి దంపతులు. లింగం గ్రామంలో సెలూన్ షాపు నడుపుతూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. వాణి (32) ఐకేపీలో సీఏగా పని చేస్తుంది. కాగా ఆమె గర్భిణి కావడంతో ఇటీవల సిద్దిపేటలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పారు. వైద్యులు పరీక్షించి ప్రసవ సమయంలో తల్లీ బిడ్డలకు ప్రాణాపాయం ఉందని తేల్చి చెప్పారు. దీంతో మెరుగైన వైద్యం కోసం ఈ నెల 18న హైదరాబాద్‌లోని గాంధీ ఆస్పత్రిలో చేర్పారు. అక్కడి వైద్యులు సైతం తల్లి, బిడ్డలకు ప్రమాదమని చెప్పారు. ఈ నేపథ్యంలో వాణికి పురిటి నొప్పులు రాగా ఆపరేషన్ చేశారు. పండంటి మగ బిడ్డకు జన్మనిచ్చింది. అనంతరం ఆమెకు బ్లీడింగ్ ఎక్కువవడంతో పాటు నోటి వెంట రక్తం రావడంతో తీవ్ర అస్వస్థతకు గురైంది. దీంతో వైద్యులు కాపాడేందుకు చేసిన ప్రయత్నాలు ఫలించకపోవడంతో ఆమె శుక్రవారం కన్ను మూసింది. దీంతో గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. ఆదివారం ఆ కుటుంబాన్ని దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి, రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య పరామర్శించారు.

ఉన్నత చదువులకోసం వెళ్లి..

విగతజీవిగా వచ్చి...

- చాట్లపల్లి విద్యార్థి పంజాబ్‌లో ఆత్మహత్య
- మిన్నంటిన తల్లిదండ్రుల రోదనలు
- సిద్దిపేట జిల్లాలో విషాదం



అజయ్

జగదేవ్‌పూర్(గజ్వేల్): ఉన్న ఒక కొడుకు ఉన్నత చదువుల కోసం పోయి కన్నవాళ్లకు కడుపుకోత మిగిల్చాడు. చక్కగా చదువుకో కొడుకా అంటూ సాగనంపిన తల్లిదండ్రులకు శోకమే మిగిలింది. ఏమైందో ఏమో కానీ అతడు ఆత్మహత్యకు చేసుకున్నాడు. ఈ ఘటన సిద్దిపేట జిల్లా జగదేవ్‌పూర్ మండలంలోని చాట్లపల్లి గ్రామంలో చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం... గ్రామానికి చెందిన బరిగె భిక్షపతి, కవిత దంపతులు. వీరికి కొడుకు అజయ్(22), కూతురు ఉన్నారు. దంపతులిద్దరు గ్రామంలోనే తమకున్న భూమిలో వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. కొడుకు ఉన్నత చదువుల కోసం పంజాబ్ రాష్ట్రంలో లవ్‌లీ ప్రొఫెషనల్ యూనివర్సిటీలో చేరాడు. బీటెక్ నాలుగోవ సంవత్సరం చదువుతూ హాస్టల్‌లో ఉంటున్నాడు. ఈ నెలలో స్వగ్రామానికి వచ్చి తిరిగి ఈ నెల 10న కళాశాలకు వెళ్లాడు. తండ్రికి ఫోన్ చేసి కళాశాల ఫీజు కోసం డబ్బులు పంపమని అడుగగా పంపించారు. ఇంతలోనే ఏమైందో ఏమోగానీ ఈ నెల 20న అక్కడే ఓ లాడ్జిలో పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. లాడ్జి నిర్వాహకులు తన ఫోన్ ద్వారా స్నేహి తులకు సమాచారం అందించారు. వెంటనే స్నేహితులు అక్కడికి చేరుకుని కుటుంబ సభ్యులకు సమా చారం అందించారు. అక్కడి పోలీసులు కేసు నమో దు చేసుకుని పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ఆదివారం ఉదయం హెలికాప్టర్ ద్వారా హైదరాబాద్‌కు, అక్కడి నుంచి చాట్లపల్లికి తీసుకొచ్చారు.

అయ్యో బిడ్డా..

అయ్యో బిడ్డా మమ్మల్ని ఆగం చేసి పోతివా అంటూ అజయ్ తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు రోదనలు పలువురిని కంటతడి పెట్టించాయి. చివరి చూపు కోసం తండోపతండాలుగా తరలివచ్చి అంత్యక్రియల్లో పాల్గొన్నారు. బీఆర్ఎస్ రాష్ట్ర నేత వంటేరు ప్రతాప్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ ఇంద్రసేనారెడ్డి మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించారు.

వీడని మహిళ హత్య మిస్టరీ

నిందితుల అరెస్టులో జాప్యం



హత్య జరిగిన స్థలాన్ని పరిశీలిస్తున్న పోలీసులు(ఫైల్)

చిన్నకోడూరు(సిద్దిపేట): గత నెలలో మండలాన్ని కుదిపేసిన కమ్మర్లపల్లి మహిళా హత్య మిస్టరీ ప్రశ్నార్థకంగా మారింది. మహిళను పట్టపగలే ఆమె నివాసంలో హత్య చేసిన నిందితుల జాడ కనుక్కోవడంలో పోలీసులు తాత్సారం చేస్తున్నా రనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. విచారణ పేరిట గ్రామంలోని పలువురిని అదుపులోకి తీసుకుని విచారించి వదిలి వేయడం లాంటి ఘటనల నేపథ్యంలో గ్రామ ప్రజల్లో భయాందోళనలు వ్యక్తమవుతున్నాయి. రోజులు గడుస్తున్నా హత్య మిస్టరీ వీడకపోవడంతో చర్చనీయాంశంగా మారింది. గ్రామానికి చెందిన గాలి బాలలక్ష్మి(50) ఇంట్లో కిరాణా షాపు నడుపుతుండగా, భర్త సుధాకర్ ఆటో నడుపుతూ జీవనం కొనసాగిస్తున్నారు. గత నెల 30న మధ్యాహ్నం గుర్తు తెలియని దుండగులు ఇంట్లో చొరబడి నిద్రిస్తున్న బాలలక్ష్మిని కత్తితో గొంతు కోసి హత్య చేశారు. పోలీసులు క్లూస్ టీమ్, డాగ్ స్క్వాడ్‌తో ఘటనా స్థలాన్ని పరిశీలించారు. బంగారు, ఆభరణాల కోసమే గుర్తు తెలియని దుండగులు మహిళను హత్య చేసి ఉంటారని పోలీసులు భావించారు. హత్య జరిగి 22 రోజులు అవుతున్నా నిందితులను గుర్తించలేదు. దీంతో కమ్మర్లపల్లిలో ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. ఈ విషయమై చిన్నకోడూరు ఎస్ఐ బాలకృష్ణను అడగగా.. విచారణ చేస్తున్నామని, నిందితులను త్వరలోనే పట్టుకుంటామని చెప్పారు.

విద్యుదాఘాతంతో ఎలక్ట్రీషియన్ మృతి



రాములు

తూప్రాన్, మనోహరాబాద్(తూప్రాన్): పొలం వద్ద కరెంటు మరమ్మతులు చేస్తుండగా విద్యుదాఘాతంతో ఎలక్ట్రీషియన్ మృతి చెందాడు. ఈ ఘటన మనోహరాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్ఐ సుభాష్‌గౌడ్ వివరాల ప్రకారం... తూప్రాన్ మండలంలోని అల్లాపూర్ గ్రామానికి చెందిన మర్రి రాములు(49) పదేళ్లుగా కాళ్లకల్ గ్రామ పంచాయతీలో ఔట్‌సోర్సింగ్ విద్యుత్ ఎలక్ట్రీషియన్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. అయితే తాను సొంతంగా ప్రైవేట్‌గా విద్యుత్ మరమ్మతు పనులు కూడా చేస్తున్నాడు. ఈ క్రమంలో ఆదివారం సెలవు కావడంతో రాములు, మరో కార్మికులు నర్సింహ, మైలారం మల్లేష్‌లతో కలిసి కాళ్లకల్ గ్రామానికి చెందిన రైతులు సాయం సంజీవ, దుర్గయ్యల పొలంలో విద్యుత్ మరమ్మతుల పనులు చేయడానికి వెళ్లారు. కాగా అక్కడ స్టాటర్‌బాక్స్‌కు విద్యుత్ సరఫరా రావడం లేదు. దీంతో రాములు విద్యుత్ స్తంభం ఎక్కి వైర్ సరి చేసే క్రమంలో విద్యుత్ షాక్‌కు గురై తీవ్రగాయాలపాలయ్యాడు. వెంటనే అతడ్ని తూప్రాన్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించేలోపే మృతి చెందాడు. ఈ విషయం తెలుసుకున్న మృతుని కుటుంబీకులు, అల్లాపూర్ గ్రామస్తులు ప్రభుత్వ ఆస్పత్రి ఆందోళన చేపట్టారు. దీంతో పోలీసులు సముదాయించి ఆందోళన విరమింపజేశారు. కాగా మృతునికి భార్య, ఒక కుమారుడు, కూతురు ఉన్నారు. మృతుని కుమారుడు ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ద్విచక్ర వాహనం అదుపుతప్పి వ్యక్తి..

కొండపాక(గజ్వేల్): రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన కుకునూరుపల్లి మండల కేంద్రంలో ఆదివారం చోటు చేసుకుంది. ఎస్సై శ్రీనివాస్ కథనం ప్రకారం... సంగారెడ్డి జిల్లాలోని అన్నారం గ్రామానికి చెందిన అవిరాల్ సింగ్ టొమార్ (27) వ్యాపారం చేసుకుంటూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. సంగారెడ్డి నుంచి ఉదయం రెండు ద్విచక్ర వాహనాలపై స్నేహితులతో కలిసి రంగనాయక్ సాగర్‌ను సందర్శించేందుకు వెళ్తున్నారు. ఈ క్రమంలో కుకునూరుపల్లి శివారులో వాహనం అదుపు తప్పి రాజీవ్ రహదారి రోడ్డు ప్రక్కన ఉన్న చెట్లలోకి దూసుకెళ్లింది. ఈ ప్రమాదంలో అవిరాల్ సింగ్ టొమార్‌కు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. స్నేహితులు కుటుంబీకులకు సమాచారం అందించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో ఫొటోగ్రాఫర్..



చేతన్‌కుమార్

గజ్వేల్‌రూరల్: రోడ్డు ప్రమాదంలో ఫొటోగ్రాఫర్ గాయపడి చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ ఘటన గజ్వేల్‌లో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే... పట్టణానికి చెందిన కాశమైన చేతన్‌కుమార్(23) ఫొటోగ్రాఫర్‌గా పనిచేస్తున్నాడు. మూడ్రోజుల క్రితం జగదేవ్‌పూర్‌లోని పోలీస్‌స్టేషన్ సమీపంలో ద్విచక్ర వాహనంపై వస్తున్న చేతన్‌కుమార్‌ను ట్రావెల్ బస్సు ఢీకొట్టడంతో తలకు తీవ్రగాయాలై కోమాలోకి వెళ్లాడు. మెరుగైన చికిత్స కోసం సికింద్రాబాద్‌లోని యశోదా ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ శనివారం అర్ధరాత్రి బ్రెయిన్ డెడ్‌తో మృతి చెందాడు. తీవ్ర దుఃఖంలో ఉన్న కుటుంబ సభ్యులు అవయవదానానికి ఒప్పుకున్నారు. ఈ విషయం తెలుసుకున్న ఎమ్మెల్సీ డాక్టర్ యాదవరెడ్డి, ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి, మున్సిపల్ మాజీ చైర్మన్ రాజమౌళి, పలువురు ప్రముఖులు కుటుంబ సభ్యులను పరామర్శించారు. గజ్వేల్ ఫొటో అండ్ వీడియోగ్రాఫర్ అసోసియేషన్ సభ్యులు చేతన్‌కుమార్ మృతిపట్ల సంతాపం వ్యక్తం చేశారు.

బస్సు,కారు ఢీ..

-ప్రయాణికులకు స్వల్ప గాయాలు

సదాశివపేట రూరల్(సంగారెడ్డి): రోడ్డు ప్రమాదంలో పలువురు ప్రయాణికులకు స్వల్ప గాయాలయ్యాయి.ఈ ఘటన మండలంలోని నందికంది శివారులో ఆదివారం చోటు చేసుకుంది. స్థానికుల వివరాల మేరకు.. నందికంది గ్రామ సమీపంలో అదుపుతప్పిన బస్సు కారును ఢీకొట్టింది. ప్రయాణికులకు స్వల్ప గాయాలయ్యాయి. పెను ప్రమాదం తప్పడంతో ప్రయాణికులు ఊపిరి పీల్చుకున్నారు. జాతీయ రహదారిపై కొనసాగుతున్న సర్వీస్ రోడ్డు నిర్మాణ పనుల్లో రోడ్డు భద్రత చర్యలు చేపట్టకుండా పనులు చేపడుతుండటంతోనే ప్రమాదం జరిగిందని స్థానికులు తెలిపారు. ప్రమాద సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అవినీతిపై చర్యలు తీసుకోవాలి

పోలీసులకు ముదిరాజ్ కులస్తుల ఫిర్యాదు



పోలీస్‌స్టేషన్‌లో ముదిరాజ్ కుల సంఘం సభ్యులు

రామాయంపేట(మెదక్): స్థానిక మల్లె చెరువులో పట్టిన చేపల అమ్మకంలో అవినీతికి పాల్పడి సంఘానికి నష్టం చేసిన వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని వందలాది మంది ముదిరాజ్ కుల సంఘం సభ్యులు ఆదివారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా సంఘం ప్రతినిధులు మాట్లాడుతూ... ముదిరాజ్ సంఘంలో సుమారుగా ఎనిమిది వందలకు పైగా సభ్యులున్నారని తెలిపారు. చేపలు అమ్మితే వచ్చే ఆదాయాన్ని సభ్యులందరికీ సమానంగా వర్తింపజేయాలని, ఇలా కాకుండా కొందరు అవినీతికి పాల్పడుతున్నారని ఆరోపించారు. ప్రతి ఏటా సంఘం తరపున పెద్దమ్మ జాతర ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నామని, జాతర ఖర్చుల నిమిత్తం మల్లెచెరువులో ఉన్న చేపల అమ్మకం ద్వారా వచ్చిన డబ్బులతో ఉత్సవాలు నిర్వహించాలని నిర్ణయించామని పేర్కొన్నారు. కొందరు వ్యక్తులు ఏకపక్షంగా మల్లె చెరువులో చేపలు పట్టి అమ్ముకున్నారని, తూకంలో సైతం అవినీతికి పాల్పడ్డారని ఆరోపించారు. జాతర ఖర్చుల నిమిత్తం రూ.ఎనిమిది లక్షలు ఖర్చు అవుతాయని, నిరుపేదలైన కుల సంఘం సభ్యులు డబ్బులు ఇచ్చే అవకాశం లేకపోవడంతోనే తాము ఈ నిర్ణయం తీసుకున్నామని చెప్పారు. నిధుల దుర్వినియోగంపై చర్యలు తీసుకోవాలని కోరారు.

రోడ్డు దాటుతున్న వ్యక్తిని ఢీకొట్టిన కారు

తీవ్ర గాయాలు.. ఆస్పత్రికి తరలింపు

పటాన్‌చెరు టౌన్: రోడ్డు దాటుతున్న వ్యక్తిని కారు ఢీకొట్టడంతో తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన అమీన్‌పూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం... అమీన్‌పూర్ మున్సిపాలిటీ పరిధిలోని గండిగూడెం వైఎస్సార్ కాలనీకి చెందిన లక్ష్మణ్ ట్రాక్టర్ నడుపుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో శనివారం ట్రాక్టర్ నడిపేందుకు వెళ్లి పని ముగించుకొని సాయంత్రం తిరిగి ఇంటికి నడుచుకుంటూ వస్తున్నాడు. ఈ క్రమంలో గండిగూడెం శివారు ఓఆర్ఆర్ సర్వీస్ రోడ్డు దాటుతుండగా పటాన్‌చెరు వైపు నుంచి దుండిగల్ వైపు వెళ్లే గుర్తుతెలియని కారు ఢీకొట్టింది. దీంతో లక్ష్మణ్ తీవ్రంగా గాయపడ్డాడు. ఉస్మానియా ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

నోరూరిస్తున్న అల్లనేరేడు



మిరుదొడ్డి(దుబ్బాక): అల్లనేరేడు పండ్లను చూడగానే నోరూరిస్తున్నాయి. వగరు, పుల్లగా, తియ్యగా మేలు రుచులతో ఉండే నేరేడు పండ్లకు మార్కెట్‌లో మంచి డిమాండ్ పలుకుతోంది. దీంతో గ్రామీణ ప్రాంత వాసులకు, రైతులకు మంచి ఉపాధిగా మారుతోంది.

యువతి అదృశ్యం



లావణ్య

పటాన్‌చెరు టౌన్: ఇంటి నుంచి బయటకు వెళ్లిన యువతి అదృశ్యమైంది. ఈ ఘటన అమీన్‌పూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం ... మెదక్‌కు చెందిన స్వరూప, కూతురు లావణ్యతో కలిసి నాలుగు రోజుల క్రితం అమీన్‌పూర్‌లో ఉండే పెద్ద కూతురు భానుప్రియ వద్దకు వచ్చింది. శనివారం భానుప్రియ కూలీ పనికి వెళ్లింది. ఈ క్రమంలో ఇంటి వద్ద ఉన్న లావణ్య బయటకు వెళ్లి తిరిగి రాలేదు. దీంతో కుటుంబ సభ్యులు స్థానికంగా, చుట్టుపక్కల వెతికినా ఆచూకీ లభించలేదు. తల్లి స్వరూప ఆదివారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

అమ్మమ్మను చూసేందుకు వచ్చి..



దివ్య

పటాన్‌చెరు టౌన్: అమ్మమ్మను చూసేందుకు వచ్చిన యువతి అదృశ్యమైంది. ఈ ఘటన అమీన్‌పూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. పశ్చిమ గోదావరి తణుకు మండలం వేల్పూరు గ్రామానికి చెందిన దివ్య ఈనెల 15వ తేదీన గచ్చిబౌలి కేర్ ఆస్పత్రిలో ఉన్న అమ్మమ్మ వెంకట వరలక్ష్మిని చూసేందుకు వచ్చింది. ఈ క్రమంలో 18వ తేదీన ఆమెను డిశ్చార్జ్ చేయగా వారితో కలిసి అమీన్‌పూర్ మున్సిపాలిటీలోని బీరంగూడ వందనపుర కాలనీకి వచ్చింది. ఈ క్రమంలో ఆదివారం ఇంట్లో ఎవరికి చెప్పకుండా వెళ్లిపోయింది. కుటుంబ సభ్యులు కోసం వెతకగా బ్యాగు తీసుకుని వెళ్లినట్లు స్థానికులు తెలిపారు. పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు దర్యాప్తు చేస్తున్నారు.

నేడు శ్రీనివాస్ విగ్రహావిష్కరణ

నర్సాపూర్ రూరల్: మండలంలోని చిప్పల్‌తుర్తి మాజీ సర్పంచ్ దుష్తల శ్రీనివాస్ విగ్రహాన్ని సోమవారం ఆవిష్కరిస్తున్నట్లు శ్రేయోభిలాషులు, స్నేహితులు, ఆయా పార్టీల నాయకులు తెలిపారు. విగ్రహావిష్కరణకు మాజీమంత్రి హరీష్ రావు, ఎమ్మెల్యే సునీతారెడ్డి, ఇతర నాయకులు హాజరవుతారని తెలిపారు. చిప్పల్‌తుర్తి ఉమ్మడి గ్రామపంచాయతీకి శ్రీనివాస్ సర్పంచ్‌గా సేవలందించారు. చిప్పల్‌తుర్తి గ్రామపంచాయతీ నుంచి విడిపోయి కొత్తగా ఏర్పడిన జక్కపల్లి సర్పంచ్‌గా తన భార్యను గెలిపించుకొని మూడు పర్యాయాలు ప్రజలకు సేవ చేశారని తెలిపారు. డంతోపాటు ప్రతి ఒక్కరి హృదయంలో చోటు సంపాదించుకున్న శ్రీనివాస్‌ను మర్చిపోలేక పోతున్నట్లు తెలిపారు. చిప్పల్‌తుర్తి, జక్కపల్లి, 10 గిరిజన తండాల అభివృద్ధికి తన వంతు కృషి చేసి అందరి మన్ననలు పొందాడని పేర్కొన్నారు. జక్కపల్లి చౌరస్తా వద్ద ఆయన విగ్రహాన్ని ఏర్పాటు చేసేందుకు అన్ని పార్టీల నాయకులు, కార్యకర్తలు, ప్రజలు తీర్మానించుకొని ఏర్పాటు చేస్తున్నట్లు వివరించా

గుగ్గిల్లలో భారీ చోరీ

రూ.4.10లక్షలు, వెండి ఆభరణాలు అపహరణ



ఇంట్లో చిందరవందరగా ఉన్న బీరువా ట్రే

బెజ్జంకి(సిద్దిపేట): ఓ ఇంట్లో నగదుతో పాటు వెండి ఆభరణాలను గుర్తు తెలియని దుండగులు అపహరించారు. ఈ ఘటన మండలంలోని గుగ్గిల్ల గ్రామంలో చోటు చేసుకుంది. ఏఎస్ఐ శంకర్‌రావు కథనం ప్రకారం... గ్రామానికి చెందిన కేడిక కృష్ణారెడ్డి, భార్య రమ వ్యవసాయం చేసుకుంటూ నివసిస్తున్నారు. శనివారం రాత్రి ఇంటి ఆరు బయట పడుకున్నారు. ఇంట్లో టీవీ బంద్ చేయడానికి అర్ధరాత్రి కృష్ణారెడ్డి వెళ్లి తిరిగి వస్తుండగా ఇంటి వెనుక గల దర్వాజ తెరిచి ఉంది. అనుమానంతో వెంటనే పక్క గదిలో వున్న బీరువాను పరిశీలించగా తాళం తీసి వుంది. ఫైనాన్స్‌లో కట్టేందుకు అప్పుగా తెచ్చి బీరువాలో పెట్టిన రూ.4.10 లక్షలు, బంగారు వెండి ఆభరణాలతో పాటు మరో బ్యాగులోని 10వేల నగదును దుండగులు అపహరించారు. దొంగలు పడ్డారని అరువడంతో స్థానికులు వీధిలోకి వచ్చారు. సుమారు 30 నుంచి 40 సంవత్సరాల యువకులిద్దరు ఆయిల్ పూసుకుని కత్తులు పట్టుకుని వెళ్లడం చూశామని స్థానికులు తెలిపారు. ఘటనా స్థలాన్ని సిద్దిపేట రూరల్ సీఐ శ్రీను, ఏఎస్ఐ శంకర్‌రావు పరిశీలించారు. చోరీ ఘటనలో 4.65 లక్షల వరకు నష్టం వాటిల్లిందని బాధితుడు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. దుండగులను గుర్తించేందుకు రెండు టీంలను ఏర్పాటు చేసి దర్యాప్తును వేగవంతం చేశామని పేర్కొన్నారు.